

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 12 జూన్ 2023 పేజీలు : 04


# విద్యుత్ బిల్లులు ముట్టుకుంటే షాక్ తగులుతోంది

**- జగన్ చేతకాని తనం, స్వార్థ ప్రయోజనాలతో విద్యుత్ రంగం కుదేలు**

**- రాష్ట్రాన్ని సీఎం జగన్ అంధకారంలోకి నెట్టారు - మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆగ్రహం**



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జూన్ 11 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రజలు విద్యుత్ బిల్లులు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి వచ్చిందని, మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తేదేపా ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంపుపై వారు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తమ నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి హయాంలో విద్యుత్ చార్జీలు ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉన్నాయో ఒక్కసారి ప్రజలు చూసుకోవాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి చర్యలతో విద్యుత్ రంగం కుదేలైందన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని విమర్శించారు. ప్రజలపై భారం మోపుతూ నాలుగేళ్లతో 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం అవినాష్‌రెడ్డి, విజయసాయిరెడ్డి కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా విద్యుత్ రంగంలో చర్యలుతీసుకుంటున్నారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు పెద్ద స్కామ్ అని రూ.10వేలు ఖరీదులేని ఈ మీటర్లను రూ.31వేలకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. మీ ధన దాహం వల్ల విద్యుత్‌చార్జీల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు కూడా ఊరూరా తిరుగుతూ విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నాలుగేళ్లలో 50 వేల కోట్లు ప్రజల నుంచి విద్యుత్‌రూపంలో ముక్కు పిండి వసూలు చేశారన్నారు. పక్కనున్న రాష్ట్రాల్లో పెరగని విద్యుత్ చార్జీలు ఒక్క ఏపిలోనే ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. ఓవైపు విద్యుత్ చార్జీలు పెంచడమే కాకుండా, అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే, భవిష్యత్తులో ఇలాంటి భారాలు మరిన్ని మోయాల్సి వస్తుందని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు.

# మాట తప్పని.. మడమ తిప్పని నేత సీఎం వైఎస్ జగన్

**- ఎమ్మెల్యే డా.పివి.సిద్దారెడ్డి**



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పారామెడికల్ ఉద్యోగస్తులు

కదిరి, జూన్ 11 ప్రభాతవార్త

మాట తప్పని మడమ తిప్పని నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే డా.పివి సిద్దారెడ్డి తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరించి ఉద్యోగులకు భద్రత కల్పించిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్‌ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే డా.పివి.సిద్దారెడ్డి కాంట్రాక్టు ఉద్యోగస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పారామెడికల్ ఉద్యోగస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.పివి.సిద్దారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలను 2014 జూన్ నాటికి 5 ఏళుల సర్వీసు పూర్తిచేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయడం శుభ పరిణామం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది కాంట్రాక్టు ఉద్యోగస్తుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపారన్నారు. ఏవైతే గత సార్వత్రిక ఎన్నికల్లో హామీలు ఇచ్చారో అధికారం చేపట్టిన తర్వాత 98.55 శాతంకుపైగా అమలు పరిచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న అభివృద్ధిని చూసి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసే విధంగా సీఎం వైఎస్ జగన్ పాలనను కొనసాగిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

**మాజీ జీవితాల్లో వెలుగులు నింపారు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేసి మాజీ వితాల్లో వెలుగులు నింపారని కాంట్రాక్టు ఉద్యోగస్తులు హర్షం వ్యక్తం చేశారు. మా కుటుంబాలకు అండగా నిలబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అంతకు ముందు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజిమున్నీసా సాధిక్, కాంట్రాక్టు ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొన 'సాగు'తున్న నాడు-నేడు 2వ దశ పనులు..!

- ❖ ఏసీఆర్‌లకు రూ.6.29 కోట్లు, ఆధునికీకరణ పనులకు రూ.9.42 కోట్లు
- ❖ నిర్మాణాలు పూర్తికాక పాఠశాలల్లో వెక్కిరిస్తున్న తగరతి గదుల కొరత
- ❖ పనులు పూర్తి కావడానికి మరో 5 నెలలు సమయం పట్టే పరిస్థితులు
- ❖ మండలానికి ఇంకా సరఫరా కాని దాదాపు 42వేల పాఠ్యపుస్తకాలు
- ❖ అపరిష్కృత సమస్యల నడుమే నేటి నుండి పాఠశాల పునఃప్రారంభం



9వ వార్డు ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం ఆదివారం రోజు కూడా జరుగుతున్న దృశ్యం



ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు 2వ దశ కింద నిర్మాణంలోవున్న అదనపు గదులు

ఉరవకొండ, జూన్ 11 ప్రభాతవార్త

ఉరవకొండ మండలంలో మనబడి నాడు-నేడు 2వ దశ పనులు పూర్తికాలేదు. దాదాపు ఏడాదిన్నర క్రితమే పనులు ప్రారంభంకాగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పనులు పూర్తి కావాల్సి ఉండగా నేటికీ కొనసాగుతుండటం విశేషంగా చెప్పాలి. నాడు-నేడు మొదటి దశ కింద 24 పాఠశాలల్లో 7.59 కోట్ల రూపాయల అంచనాలతో పనులు ప్రారంభమై పూర్తికాగా 2వ దశ కింద మండలంలో 54 పాఠశాలల్లో 16.20 కోట్ల రూపాయల అంచనాలతో అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, వంటగదులు, తాగునీటి వసతి, మేజర్, మైనర్ రిపేర్లు రెండు పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణం జరుగాల్సి ఉంది. అయితే నేటికీ అదనపు తరగతి గదుల నిర్మాణాలు కొనసాగుతుండగా ఇతరత్రా పనులు దాదాపు పూర్తి కావచ్చాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ నేపథ్యంలో ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోనూ తరగతి గదులు కొరత వెక్కిరిస్తుండగా నేటి నుండి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే...

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల కంటే మెరుగ్గా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన మనబడి నాడు-నేడు పథకం 2వ దశ పనులు ఉరవకొండ మండలంలో పూర్తికు నోచుకోలేదు. 2వ దశ కింద ఉరవకొండ మండలంలో 54 పాఠశాలలను ఎంపిక చేసి 16.20 కోట్ల రూపాయలను కేటాయించగా ఇందులో 6.29 కోట్ల రూపాయల వ్యయంతో 47 అదనపు తరగతి గదులు, 9.42 కోట్ల రూపాయల వ్యయంతో ఇతరత్రా ఆధునికీకరణ పనులు, 49 లక్షల రూపాయలతో మూలగిరిపల్లి ప్రాథమికోన్నత, నెరమెట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రహరీగోడల నిర్మాణం జరుగాల్సి ఉంది. అయితే అదనపు తరగతి భవనాల నిర్మాణం పనులు ఇప్పటికీ పూర్తి కాకపోగా తగరతి గదుల కొరత నడుమే నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి నూతన విద్యా విధానంలో భాగంగా 3, 4, 5 తరగతులను 3 నుంచి 5కిలో మీటర్ల దూరంలోవున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయగా ఆయా పాఠశాలల్లో తరగతి గదుల కొరత వెక్కిరిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో వారికి పాఠాలు ఎక్కడ, ఎలా చెప్పాలో అర్థంకాక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. తొలి దశలో మండలంలో జరిగిన దాదాపు 8 కోట్ల రూపాయల వ్యయంతో జరిగిన పనుల్లో అనేక చోట్ల అవినీతి అక్రమాలు చోటు చేసుకోవడం జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ విచారణ జరుగడం తెలిసిందే. ఈ క్రమంలోనే 2వ దశ కింద జరుగనున్న పనులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి అయ్యేలా జిల్లా అధికారులు మండలంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. ఇదిలావుండగా నేటి నుండి పాఠశాలలు పునః ప్రారంభం అవుతుండగా నేటికీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు కూడా సరఫరా కాకపోవడం విశేషం. మండలానికి దాదాపు 1.13 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరంకాగా ఇప్పటివరకు దాదాపు 71వేల పాఠ్యపుస్తకాలు మాత్రమే సరఫరాకాగా ఇంకా 42వేల పాఠ్యపుస్తకాలు సరఫరా కావాల్సి ఉంది. 1 నుంచి 9వ తరగతి వరకు సమిస్టర్ 1 పాఠ్యపుస్తకాలు, 10వ తరగతికి సంబంధించి పూర్తిస్థాయిలో సరఫరాకాగా, 2 సెమిస్టర్ పుస్తకాలు అన్నీ రావాల్సి ఉంది.

# శ్రీధర్ రెడ్డీ విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టు

**-మాజీ మంత్రి పల్లె -శిల్పారామం గుట్టపై పర్యటన**



శిల్పారామం కాలనీల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

శ్రీసత్యసాయి జిల్లా (వైద్యం), జూన్ 11, ప్రభాతవార్త

ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ప్రతిపక్షమైన టిడిపిపై విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే ఇలాగే అభివృద్ధిపై శ్రద్ధ వదిలీ విమర్శలు చేస్తుంటే ఆయన అధికారంలో ఉన్నారని ప్రజలెవరూ గుర్తించడం లేదన్నారు. ఆదివారం ఆయన పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారం గుట్టపై కాలనీల్లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, తాము అధికారంలో ఉన్నప్పుడు ఇంటి స్థలం లేని వారందరికి 1174 మందికి రెండుసెంట్లు చొప్పున ఇంటి పట్టాలు అందించామన్నారు. అందులో 674 ఇంటి నిర్మాణాలకు ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు చొప్పున మంజూరు చేశామని, 428 ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఇదే కాలనీల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి రూ.11.50 కోట్లతో విద్యుత్,మట్టిరోడ్లు, తదితర పనులు చేపడితే వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు పూర్తయినా కనీసం ఇక్కడ మూరెడు సిమెంట్‌రోడ్డు కూడా వేయలేకపోయారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యం ఉంటే ఈ కాలనీలకు సిసి రోడ్లు వేయాలన్నారు. ఎమ్మెల్యే జగనన్న కాలనీలను పొలుస్తూ ఇలాంటి కాలనీ ఒక్కటైనాఇచ్చారా? అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, తాము వారిలో ఏమాత్రం సరిపోని చాలీ, చాలని సెంట్ జాగాకు పట్టా ఇవ్వలేదని, రెండు సెంట్ల పట్టాలు ఇస్తూ టిడిపి హయాంలో ఇంటి నిర్మాణాలకు ఇసుక ఫ్రీగా ఇచ్చి, సిమెంట్ రూ.140లుగా అందుబాటులోఉంచామన్నారు. అయితే ప్రస్తుతం ఇసుక అమ్ముకుంటూ ఒక్కోక్క బస్తా సిమెంట్ రూ.400లు అయ్యిందని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలు తప్పితే రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇంటి నిర్మాణానికి ఇచ్చిందేమీ లేదన్నారు. మాటెత్తితే కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను తమ ఘనతగా చెప్పుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం నుండి జీవో కానీలను చూపడం తప్పితే నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. తాను పల్లె రఘునాథ్ రెడ్డిలాగా టెంకాయలు కొట్టను అని చెప్పుకునే శ్రీధర్ రెడ్డి ఇప్పుడు నువ్వు నియోజకవర్గంలోని ప్రారంభిస్తున్న 50 రోడ్లకు అనుమతులు, నిధులు మంజూరు చేసింది నాటి పంచాయతీ రాజ్ మంత్రి నారాలోకేష్ అన్న సంగతి మరచిపోకూడదన్నారు. 103 కి.మీ. నిర్మాణానికి గాను రూ.51 కోట్లు మంజూరు చేసి టెండర్లు పూర్తయ్యాయని, అగ్రిమెంట్లు చేసుకున్నాక ఎన్నికల కారణంగా వాయిదా పడితే హుందాగా టిడిపి హయాంలో మంజూరు అయ్యిందని చెప్పలేని స్థితిలో ఉన్నామని విమర్శించారు. నియోజకవర్గంలో నువ్వు సొంతంగా సాధించిన ప్రగతి ఏమిటో ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏమి పోరాడి తెచ్చావో ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్నది నువ్వే అన్న విషయాన్ని గుర్తెరిగి చౌకబారు విమర్శలు మానుకొని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

# నేడు మోగనున్న బడి గంట...!

**- విద్యార్థులతో కిటకిటలాడుతున్న బుక్‌స్టాల్స్ - వారం రోజుల పాట ఒంటిపూట బడులు**



అనంతపురం న్యూటౌన్, జూన్ 11 ప్రభాతవార్త

నూతన విద్యా సంవత్సరం సోమవారంతో ప్రారంభం అవుతోంది. ఎండలు తీవ్రత వలన వారం రోజులు పాటు ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 4000లకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు.. గత విద్యా సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీకి ముగియడంతో మే 1 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు విద్యాశాఖ వేసవి సెలవులను ప్రకటించింది. నూతన విద్యా సంవత్సరం సోమవారం (ఈ నెల 12) నుంచి ప్రారంభం అవుతోంది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో వారం రోజులు పాటు ఒంటి పూట బడులు నిర్వహించాలని, ఉదయం 7:30 గంటల నుండి 11:30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బడి గంట 7:30 గంటలకు మోగనుంది. పునఃప్రారంభానికి పాఠశాలలను కూడా సిద్ధం చేయాలని విద్యాశాఖ నాలుగు రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే మొదటి రోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను పంపిణీ చేయడానికి జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష చర్యలు తీసుకుంటుంది. పలు ప్రభుత్వ పాఠశాలలకు కూడా కొత్త హెచ్‌ఎంలు, టీచర్లు, సిబ్బంది బదిలీ కావడం జరిగింది. దీంతో మొదటి రోజు సందడి నెలకొననుంది.



**విద్యార్థులతో కిట కిటలాడుతున్న బుక్‌స్టాల్స్**

నూతన విద్యా సంవత్సరం సోమవారం ప్రారంభం అవుతుండటంతో అనంతపురం జిల్లా కేంద్ర, ఇతర పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లోని బుక్‌స్టాల్స్ విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. విద్యార్థులకు కావాల్సిన విద్య సామాగ్రి కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులను బుక్ స్టాల్స్‌కు తీసుకెళ్ళి కొనిచ్చుకొని పాఠశాలలకు వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు.

# కన్నుల పండుగగా తిరుప్పావడై సేవ

**- భారీగా తరలి వచ్చిన భక్తులు - కిటకిటలాడిని టిటిడి కళ్యాణ మండపం**

**- భారీ ఏర్పాట్లు చేసిన గోవింద వాసవి భజన సేవా సంఘం**



స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి గోవిందా వాసవి భజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన తిరుప్పావడై సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



భారీగా హాజరైన భక్తులు



అనంతపురం, జూన్ 11 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం ఆవరణంలో శ్రీ గోవింద వాసవి భజన సేవా సంఘం అధ్యక్షులు ఆల్లగడ్డ రాము ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన తిరుప్పావడై సేవా కార్యక్రమం పండుగగా సాగింది. వేద పండితులు పూజలు, వ్రతాలు అర్చన, హోమాల మధ్య తిరుప్పావడై సేవను భక్తులు వీక్షించారు. నిర్వాహకులు ఊహించిన దానికంటే పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో టిటిడి కళ్యాణ మండపం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ గోవింద వాసవి భజన సంఘం కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరుమల దేవస్థానం ఇతర భక్తుల సహకారంతో తిరుప్పావడై సేవా కార్యక్రమాన్ని ఇతర భజనల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఫలహారాన్ని, ప్రసాదాలను కూడా నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా శ్రీ గోవింద వాసవి భజన సంఘం అధ్యక్షులు ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ.. గోవింద సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ఒక భక్తుని ఇంట్లో 100 వారాలకుపైగా వరుసగా ప్రతి శనివారం భజనలు నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించామన్నారు. భక్తుల ఇళ్లల్లోనే గోవింద సేవా భజనలు నిర్వహించామని ఇందుకు మా కమిటీ సభ్యులు ఎంతో కష్టపడ్డారన్నారు. కరోనా సమయంలో కూడా మా ఇంటిలోనే కుటుంబ సభ్యుల సహకారంతో ప్రతి శనివారం ఆటంకం కలగకుండా గోవింద భజనలు, పూజలు నిర్వహించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ విధంగా వచ్చిన హారతి పళ్లెంలో వచ్చిన విరాళాలతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. వృద్ధాశ్రమాలు, అనాధ ఆశ్రమాల్లో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆళ్లగడ్డ రాము తెలియజేశారు.

# గ్రామీణ క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తా

**- అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య**

శెట్టూరు, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలో జరుగుతున్న శెట్టూరు ప్రీమియం లీగ్ 12వ సీజన్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లను ఆదివారం అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య టాస్ వేసి లాంఛనంగా ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో పోటీ పడుతున్న ఎబిడి బ్లాస్టర్స్, పవర్ ప్యాంథర్స్ జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. సుహృద్భావ వాతావరణంలో 12 సీజన్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయం అని, క్రీడా గ్రౌండ్ లేక పోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నామని భగత్ క్రికెట్ అసోషియేషన్ సభ్యులు పార్లమెంట్ సభ్యులు దృష్టికి తీసుకోవడంతో స్పందించి ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించి క్రీడా గ్రౌండ్ కోసం తనవంతుగా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, దొరస్వామి, క్రికెట్ మేనేజ్‌మెంట్ సభ్యులు అబ్దుల్, ఎమ్మెస్ రాయుడు, సోమునాథ్, రోషన్, జమీర్, రామ్మోహన్‌రెడ్డి, బ్రహ్మయ్య, ఎమ్మెస్‌బాబు, రమేష్, నగేష్ స్వామి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపి రంగయ్య

## కళాశాల వేళ్ళ్లై దారి లేక పోయే

- దారి చూపించాలంటూ విద్యార్థుల వేడుకోలు



కళాశాలకు వేళ్లె దారి మూసివేసిన దృశ్యం

**కంబదూరు,జూన్ 11,ప్రభాతవార్త**

వేసవి సేలవులు ముగుస్తు వస్తుండటంతో కళాశాలకు వేళ్లెందుకు విద్యార్థులు సిద్ధమవుతున్న తరుణంలో ఆ గ్రామంలో కళాశాలకు వేళ్లా లంటే దారి లేక కొండను ఏక్కవలసిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు,జోగి కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పూర్తి వివరాల్లోకి వేలితే కంబదూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనీయర్ కళాశాలకు గతంలో వేళ్లెందుకు 251,252 సర్వే నంబర్లలో దారి ఉండేది,అయాతే పలు కారణాల వల్ల భూ యజమానులు ఆ భూమి తమదేని కాలేజీకి వేళ్లె దారిని మూసి వేశారని జోగి కాలనీ వాసులు, విద్యార్థులు వాపోతున్నారు.దీంతో హాస్టల్‌కు,కళాశాలకు చదువుకోవడానికి వేళ్లె విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది.ఇప్పటికే కళాశాలకు ఉన్న రెండు దార్లు మూసుకు పోవడంతో ఏటు వేళ్లాలో తెలియక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిబిరాలు

**కంబదూరు,జూన్ 11,ప్రభాతవార్త**



సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కంబదూరు మండల కేంద్రంలోని గ్రంథాలయ పరిధిలో 35 రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వేసవి శిబిరాలు ఘనంగా ముగిశాయని గ్రంథాలయ పాఠకులు సత్యం బాబు ఆదివారం మీడియాకు తెలిపారు. గ్రంథాలయ వేశవి శిబిరాలను చైర్మన్ ఉమా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారని ఆయన అన్నారు.వేసవి శిబిరంలో భాగంగా గ్రామంలోని పిల్లలకు గ్రంథాలయంపై అవగాహన కల్పించడం, గ్రంథాలయంలోని కథల పుస్తకాలను చదివించటంతో పాటు,క్యారం వంటి ఆటాలు నిర్వహించడం జరిగందని పాఠకులు చెప్పారు. గ్రంథలయ ముగింపు వేశవి శిబిరాలకు కంబదూరు సర్పంచ్ పద్మావతి ముఖ్య అతిదిగా హాజరై మాట్లాడుతూ పిల్లలందరు గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయ సిబ్బంది సర్పంచ్‌ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ టెక్నికల్ అసిస్టేట్ మహేష్,నాగరాజు,వైసీపీ నాయకులు చెన్నకేశవులు,పాఠకులు సత్య బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు

**పావగడ, జూన్ 11 ప్రభాతవార్త**



మహిళలకు ఉచిత బస్ టికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్

మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రనజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అంచలంచెలుగా అమలుచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి. వెంక టేష్ పేర్కొన్నారు. అందులో భాగంగానే శక్తి యోజన పథకం ద్వారా రాష్ట్రమంతటా మహిళలకు ఉచిత ప్రయాణమును బస్సులను ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆదివారం చేపట్టింది. అందులో భాగంగా పావగడలోని కెఎస్ ఆర్‌టిసి డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శక్తి యోజన పథకం అమలు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు మానం వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు వెంకటరమణ, రాజేష్, రవి, వేలురాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ

**అమరాపురం,జూన్ 11,ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఆధర్శ పాఠశాల యందు ఆరోవ తరగతి ప్రవేశ పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యహ్నం 12 వరకు ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఓబులపతి తెలిపారు.ఈ సంతర్భంగా 112 మంది విద్యార్థులు అన్‌లైన్ ద్వారా ఆరోవతరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసు కోగా ప్రవేశ పరీక్ష యందు 111 మంది హాజరై పరీక్షల్లో పాల్గొన్నట్లు అయన పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాన్ని ఏంఈఓ సత్యనారాయణ సందర్శించారు.ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

## ద్విచకవ్రాహనంను ఢీ కొన్న కారు

-మహిళ మృతి, ఇరువురికి తీవ్రగాయాలు



మృతి చెందిన రమణమ్మ (ఫైల్‌ఫోటో)

**కొత్తచెరువు, జూన్ 11, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొత్తచెరువులోని ధర్మవరం రహదారి పొలిమేరల్లో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనం వేగం తగ్గించి వస్తున్న వారిని వెనుక వైపు నుండి పుట్టపర్తి పట్టణం కర్ణాటక నాగేపల్లికి చెందిన మారుతి ఎకో వాహనం బలంగా ఢీ కొనడంతో రమణమ్మ(29) అనే మహిళ మృతి చెందగా, మరో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కె.ఎం.లింగన్న అందించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమై కొత్తచెరువులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నివాసముంటున్న సూరి, తన భార్య రమణమ్మ, కుమార్తె సాయిప్రియతో కలసి మండల పరిధిలోని వేములేటిపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఓ శుభకార్యంలో చెక్కల భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం కొత్తచెరువుకు తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కొత్తచెరువు పొలిమేరల్లోకి రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం తగ్గించి ప్రయాణిస్తుండగా వెనుకవైపు అనంతపురం నుండి పుట్టపర్తికి వస్తున్న గందోడి అనిల్‌కుమార్ తన మారుతి ఎకో వాహనం ఎపి 39 యుఆర్ 7501తో వేగంగా వస్తూ బలంగా ఢీకొట్టాడు. దీంతో ఈ దుర్ఘటనలో రమణమ్మ తీవ్రంగా గాయపడగా, భర్త సూరి, కూతురు సాయిప్రియలకు కాళ్ళు విరిగి తీవ్రగాయాలయ్యాయి. దీంతో హుటాహుటిని వారిని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో రమణమ్మ మృతి చెందినట్లు తెలియజేశారు. సూరి, సాయిప్రియలుచికిత్స పొందుతున్నట్లు తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

## నేడు నిద్రగట్టలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

**అమరాపురం,జూన్ 11,ప్రభాతవార్త**

మండల పరిధిలో నిద్రగట్ట గ్రామ పంచాయితీ యందు సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈరన్న,ఎంపిడిఓ మునిస్వామిలు తెలిపారు.ఈ కార్యక్రమానికి మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి,వక్కలిగ కార్పోరేషన్ చైర్‌పర్సన్ నళినిరంగే గౌడ్‌లు విచ్చేస్తున్నందున,అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## చంద్రశేఖర్‌ను సన్మానించిన బిజేపి నాయకులు



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న బిజేపి నాయకులు

**మడకశిర జూన్ 11 ప్రభాతవార్త**

పట్టణంలోని పెనుకొండ రోడ్డులోని సుకన్య ఆసుపత్రి నందు బిజేపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంఛార్జ్ ఎస్.చంద్రశేఖర్ ను బిజేపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ సేవాభావంతో ప్రజలకు సేవలు అందించిన ప్రతి ఒక్కరికి గుర్తింపుతో పాటు పదవులు ఇచ్చి గౌరవిస్తుందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ కార్యక్రమాలను చురుకుగా చేపడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేసినందుకు చంద్రశేఖర్ సేవలను గుర్తించి బిజేపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంఛార్జ్‌గా ఉన్న ఎస్.చంద్రశేఖర్‌ను మార్కెట్ యార్డ్ రైతు భరోసా కేంద్రాలకు రాష్ట్ర ఇంఛార్జ్‌గా నియమించి సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని అన్నారు. చంద్రశేఖర్‌ను జోనల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన బిజేపి నాయకులు చంద్రశేఖర్‌కు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని నరేంద్రమోడి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం స్టిక్కర్లు అంటించి తామే అమలు పరుస్తున్నట్లు గొప్పలు చెప్పుకొంటోందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. రైతులకు అందించే భరోసా నిధులు విడుదలై వారం రోజులు కావస్తున్న నేటికి రైతుల ఖాతాలోకి జమ కాకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి డాక్టర్ కెవిఆర్ గుప్తా, ఓబిసీ ప్రధాన కార్యదర్శి నరేష్‌యాదవ్ ,ఎస్సీ మోర్చా జోనల్ ఇంఛార్జ్ తిరుమలేష్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డరంగేగౌడ, టీచర్ సెల్ కన్వీనర్ లక్ష్మీనారాయన, యువ మోర్చా అధ్యక్షులు రవీంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు భానుదాస్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మఠం లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి ప్రభుకుమార్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనరసింహప్ప, విరూపాక్షి, శివరామిరెడ్డి, మెళవాయి నాగరాజు, పెన్నప్ప, కాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

**అమరాపురం, జూన్ 11, ప్రభాతవార్త**



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాణ శిబిరం ముగింపు సమావేశం గ్రంథాలయ అధికారి ఇబ్రహీమ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎంపీపీ ఈరన్న, ఎంపిటిసి నాగభూషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను విద్యార్థులు,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముఖ్యంగా వివిద పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల కోసం 35 రోజుల పాటు వేసవి విజ్ఞాణ శిబిరాన్ని ప్రభుత్వం గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసి,ఆట పోటీలతో పాటు వివిధ కార్యక్ర మాలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతులను అందజేశామన్నారు. కార్య క్రమం నందు క్రిష్టియన్ డైరెక్టర్ సుందర్ రాజ్, ఉపాధ్యాయులు మారుతిరావు, సిద్దేశ్వర,బిడిసిలో శివరం మారన్న, గొడనకుంట వీరకేతరాయ, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం,దుస్తుల పంపిణి



మొక్కలు నాటుతున్న దృశ్యం

**అమరాపురం,జూన్ 11,ప్రభాతవార్త**

అమరాపురం మండల కేంద్రం నందు వున్న ఎస్ఎల్ఎన్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం వారిచే మడకశిర పట్టణంలోని తులసీదామ వృద్ధాశ్రం నందు వృద్ధులకు అన్నదానం,దుస్తులు పంపిణి కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. అదేవిధంగా వృద్ధులకు పండ్ల పంపిణి నిర్వహించారు.అనంతరం వృద్ధాశ్రమ అవరణంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహకులతో పాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థుల సమక్షంలో మొక్కలను నాటు కార్యక్రమాన్ని వృద్ధాశ్రమం అవరణంలో ఆశ్రమ నిర్వాహకుల సమక్షంలో మొక్కలు నాటారు. అదేవిధంగా ఐదువేల రూపాయల నగదును వృద్ధులకు అన్నదానం చేపట్టేందుకు విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్ కంప్యూటర్ నిర్వహకులు పురుషోత్తం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

**రొద్దం,జూన్ 11,ప్రభాతవార్త**



ఎస్ఐ నాగస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

రొద్దం మండలంలోని గ్రంథాలయం నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాణ శిబిరం సెలవుల్లో విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభా నైపుణ్యం, సృజనాత్మకత, చిత్రలేఖనం మొదలగు నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమం 45 రోజులుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రొద్దం ఎస్ఐ నాగస్వామి,రిటైర్డ్ విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు మారుతి,తేజ,గ్రంథాలయ అధికారి నాగరాజు పాల్గొన్నారు. మే 8 నుండి జూన్ 11 వరకూ అనగా 45 రోజులు ఈ కార్యక్రమం గురించి, వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తూనే వుండాలని విద్య యేక్క ఆవశ్యకత,క్రమశిక్షణ గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి,రిటైర్డ్ టీచర్ లక్ష్మిరెడ్డి,ఎ.ఎస్ఐ కాంతప్ప.టీచర్లు మారుతి,తేజ,గ్రంథాలయ అధికారి నాగరాజు గారు వచ్చిన వక్తలను శాలువాలతో సన్మానించడం జరిగింది.అనంతరం విద్యార్థీనీ,విద్యార్థులకు స్వీట్లు,బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.

## నేడు నూతన సచివాలయం ప్రారంభం

**లేపాక్షి, జూన్ 11 ప్రభాతవార్త**

మండలంలోని కల్లూరు గ్రామంలో నూతన సచివాలయాన్ని సోమవారం ఎంఎల్‌సి మహమ్మద్‌ఇక్బాల్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. అనంతరం లేపాక్షి మండల కేంద్రంలోని ఓరియంటల్ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి, జెడ్‌పిటిసి, వైస్‌ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైస్‌సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్టోర్ డీలర్లు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యతో అనుకున్న లక్ష్యం సాధించవచ్చు

- ఆర్డీటి ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్ మురళి



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహనమురళి

**బత్తలపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యశించినట్లయితే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవచ్చునని ఆర్డీటి ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్ మురళి విద్యార్థులకు సూచించారు. ఆదివారం స్థానిక ఆర్డీటి ఆడిటోరియంలో రీజనల్ పరిధిలో ఆర్డీటి సెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఆయనతో పాటు ఆర్డీ ప్రమీల హాజరై విద్యార్థులకు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఆర్డీటి సంస్థ 10వ తరగతిలో 500మార్కులు పైబడిన పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఆర్డీటి ప్రోత్స హన్ని అందిపుచ్చుకున్న పలువురు ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రయోజకులయ్యారన్నారు. కార్పొరేట్ విద్యను ఇంటర్మీడియేట్, బిటెక్ స్థాయిలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను చదివినట్లయితే అనుకున్నది సాధించి మంచి గౌరవప్రదమైన స్థాయికి ఎదగవచ్చునన్నారు. రీజనల్ స్థాయిలో ఆర్డీటి సెట్‌లో 461మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో 68మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరికి 6సంవత్సరాల పాటు విద్యకు అయ్యే ఖర్చును ఆర్డీటి సంస్థ భరిస్తుందన్నారు. వీరిని కర్నూలు, అనంతపురం, విజయవాడ, తిరుపతి పట్టణాలలో చదివే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ యేడు ఎంపికైన విద్యార్థులందరికి జిల్లా స్థాయిలో జూన్ 14న సమావేశం వుంటుందన్నారు. విద్యార్థులు ఆర్డీటి ప్రోత్సాహన్ని అందిపుచ్చుకుని సంస్థకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటిఎల్‌లు రుక్మాంగద, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, రఘురాం ఎస్టీఎల్‌లు రామక్రిష్ణ, సురేంద్ర, సిఓలు వెంకటేషు, సురేష్, చిత్రసేన, రామాంజనేయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టిప్పర్

- ఒకరు మృతి



ప్రమాదస్థలిలో గుమికూడిన గ్రామస్థులు

ప్రమాదంలో మృతిచెందిన రామక్రిష్ణ

**బత్తలపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**

మండలంలోని పోట్లమర్రి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనధారుడు మృతిచెందారు. ఆదివారం బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోట్లమర్రి గ్రామానికి చెందిన తరికి రామక్రిష్ణ(47) తన వ్యవసాయ పొలం వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ద్విచక్రవాహనం పోట్లమర్రి సమీపంలో వున్న వృద్ధాశ్రమం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనింది. దీంతో రామక్రిష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ శ్రీహర్ష ఆదేశాల మేరకు సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏపి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బయపరెడ్డి, నరేంద్రరెడ్డి, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఆర్డీటి ఆసుపత్రి వద్దకు చేరుకుని రామక్రిష్ణకు నివాళులర్పించారు. కుటుంభ సభ్యులను పరామర్శించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు వున్నారు.

## ఘనంగా వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు



వేసవి శిక్షణ విజ్ఞాన శిబిరాలు ముగింపు సందర్భంలోని దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**

చెన్నేకొత్తపల్లి శాఖ గ్రంథాలయంలో 35 రోజులపాటు జరిగిన వేసవి విజ్ఞాన విభిరాలు ముగింపు సమావేశం ఆదివారం, చెన్నేకొత్తపల్లి, గ్రంథాలయ అధికారి జి.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ గ్రంథాలయ ముగింపు, సమావేశానికి ముఖ్య అతిథిగా చెన్నేకొత్తపల్లి మండల ఎస్సై శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారం, విద్యార్థిని విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లి ఇక్కడ ఉండే పత్రికలు, పుస్తకాలు, చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం చిత్రలేఖనం, పేపర్‌క్రాఫ్ట్, కథలు చెప్పడం వంటి అనేక రకాల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్, విశ్రాంత ఉపాధ్యాయులు గంగారెడ్డి, ప్రవీణ్‌కుమార్ రిసోర్స్ పర్సన్, సిబ్బంది గ్రంథాలయ సిబ్బంది నాని స్వామి, పాఠకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ముగిసిన సమ్మర్ క్యాంపు

**కనగానపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి గోవిందు

35 రోజులు సమ్మర్ క్యాంపును మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ శిక్షణ శిబిరాల్లో భాగంగా ముగింపు కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. మండల గ్రంథాలయ అధికారి గోవిందు ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు కథలు, వ్యాసరచన, ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థీనీ, విద్యార్థులకు స్కూల్ సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, రిసోర్స్ పర్సన్‌లు ఆవుల రామాంజినేయులు, నాగసముణీంద్ర, పాఠకులు పాల్గొన్నారు.

## మూడురోజుల పాటు మారెమ్మదేవత విగ్రహ ప్రతిష్ట వేడుకలు

**బత్తలపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**

మండలంలోని గంటాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మారెమ్మదేవత విగ్రహ ప్రతిష్ట వేడుకలు మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కాలనీ వాసులు మాట్లాడుతూ సోమవారం గణపతి పూజ, యుమున పూజ, స్వస్తి వాచనము, కళశస్థాపన, జలాధివాసము, 13వ తేదీన మహాగణపతి, సుబ్రమణ్య, నవగ్రహ, లక్ష్మినారాయణ హోమాలు, ధ్యానాదివాసము, దీక్షాహోమము, రుద్రహోమం, దుర్గాహోమం, శయ్యాదివాసము, 14న ఉదయం 6.25గంటలకు యంత్రప్రతిష్ఠ, బింబస్థాపన, దేవి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమము, కూష్మాండబలి, పూర్ణాహుతి అనంతరం అన్నధాన కార్యక్రమం నిర్వహించబడునని కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హజరై అమ్మవారి తీర్ధప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## విద్యార్థులు విద్యలో రాణించాలి



పురస్కారాలు అందిస్తున్న మాజీమంత్రి పల్లె, బెస్త సంఘం నాయకులు

**పుట్టపర్తిటౌన్, జూన్ 11, ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యలో రాణించి బవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతి చంద్రశేఖర్ అధ్యక్షతన 10వ తరగతిలో ప్రతిభ కనబరచిన బెస్త విద్యార్థులకు ప్రతిభా పుస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి పల్లె రగునాథ్ రెడ్డితో పాటు పారిశ్రామిక వేత్త పులివెందుల గువ్వల గంగాధర్, రంగయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, విద్యకు పేదరికం అడ్డుకాదని, నిరుపేదల కుటుంబాలలో పుట్టిన అబ్రహం లింకన్, అమెరికా అధ్యక్షుడుగా, పేపర్ బాయ్‌గా పనిచేసిన అబ్దుల్ కలాం సైంటిస్ట్‌గా, దేశ రాష్ట్ర పతి కాగలిగారన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, దాన్ని నిరూపించుకోవాలన్నారు. అనంతపురంజిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ మాట్లాడుతూ, బెస్తలు రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ సందర్భగా జిల్లాలో ఎక్కువ మార్కులు సాధించిన బెస్త విద్యార్థులకు గువ్వల గంగాధర్ బెస్తపూజిత, సాయిలకు రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన గీతాంజలికి రూ.7వేలు, మూడో స్థానంలో నిలిచిన మహేందర్‌కు రూ.5 వేల చోప్పున మిగిలిన 27 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున నగదుతో పాటు మెమొంటోలు, మెడల్, సర్టిఫికెట్లు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బయన్న, లక్ష్మినారాయణ, రామ్మోహన్, సలహాదారు బెస్త చలపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, జయసాయి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్యసేవలు అందించడమే రోటరి క్లబ్ లక్ష్యం

**ధర్మవరం,జూన్ 11,ప్రభాతవార్త**



చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే రోటరి క్లబ్ యేక్క లక్ష్యం అని అధ్యక్ష,కార్యదర్శులు కృష్ణమూర్తి, కోశాదికారి జయసింహా, రామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదివారం పట్టణ్లఒని కోటా మున్సిపల్ పాఠశాలలో రోటరి క్లబ్ ధర్మవరం–శంకర్ కంటి ఆసుపత్రి–బెంగళూరు,జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్లు,వైద్యశిబిరంను నిర్వహించారు. ఈ శిబిరంలో పట్టణ,గ్రామిణ ప్రాంతాల నుండి 260 మంది రోగులు రావడం జరిగిందని,ఇందులో డాక్టర్ కళ్ల వైద్య చికిత్సలు అందించిన దరువాత 186 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందన్నారు. శిబిర దాతలుగా కీర్తిశేసులు సోలిగాల్ల పేద్దవెంకటేశులు జ్ఞాపికార్థం,వీరి భార్య సోలిగాల్ల రామాంజనమ్మ,విరి కూతులు రూపాదేవి,అల్లుడు నారాయణ,కుమారులు కోండప్ప,భార్య వరలక్ష్మి,భరత్ కుమారులు వ్యవహరించారని,ప్రతి శిబిరానికి రవాణ సౌకర్యంను కల్పించిన దాత కీర్తిశేషులు ఉల్లక్కిరెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి వారి మిత్రులకు,ప్రత్యేకంగా కృతజ్ఞాతలను తెలియజేశారు. తదుపరి శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్ మాల్వికి,ఆసుపత్రి పిఆర్ఓ శివ ప్రకాష్‌లతో పాటు,దాతలను కూడా ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ చైర్మన్ సోలిగాల్ల వెంకటేశులు,ఆర్గనైజర్స్ నరేంద్రారెడ్డి, శివయ్య, బండారు చలం,కోండయ్య మనోహర్ గుప్తా తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంను విడనాడండి

**ధర్మవరం,జూన్ 11,ప్రభాతవార్త**



చికిత్స అందిస్తున్న దృశ్యం

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంను విడనాడాలని వైసీపీ నాయకులు చాంద్ భాషా పేర్కోన్నారు.ఈ సందర్భంగా ఆదివారం కోత్తపేటలోని మున్సిపల్ భాలికల ఉన్నత పాఠశాలలోని, నౌజవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా హస్పేటల్ సహకారంలో ఉచిత గుండే వైద్యం శిబిరం నిర్వహించారు.అనంతరం నౌజవాన్ సేవా సమితి అధ్యక్షులు జాకీర్ హుసేన్,కార్యదర్శి తోపిక్‌లు మాట్లాడుతూ ఈ శిబిరంలో జిఆర్‌బిస్/బిపి/ఈసిజీ/2డిఎకో ఉచితంగా చేయడం జరిగిందన్నారు. ఆటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల చాంద్ భాషాతో పాటు కౌన్సిలర్, శంషాద్ బేగం,నౌజవాన్ సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమం పట్లా వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో సవేరా అసుపత్రి మేనేజర్ షేక్షావలి,రీనా, సేవా సమితి సభ్యులు అబ్బుల్,ఇస్మాయిల్,తకి,ఆమీర్ భాషా,ఇనాయతుల్లా, హినాయతుల్లా, అబుబకర్,జబి, ఆమర్,షాహిద్, నాను,సలిమ్ పాల్గొన్నారు.

## చిన్ననాటి మిత్రుల ఆపన్న హస్తం



మృతి చెందిన సాయిప్రవీణ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రబృందం

**కొత్తచెరువు, జూన్ 11, ప్రభాతవార్త**

ఇటీవల కొత్తచెరువుకు చెందిన కృష్ణం సాయిప్రవీణ్ (44) ఇటీవల హఠాన్మరణం చెందడంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆయన కుటుంబాన్ని చిన్ననాటి మిత్రులు తలా ఓ చెయ్యి వేసి ఆపన్న హస్తం అందించారు. 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ప్రవీణ్ ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయి ప్రవీణ్ చిత్రపటానికి నివాళులర్పించి, లక్ష రూపాయల ఆర్థిక సహాయం మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ భాస్కర్ నాయుడు, టీచర్‌లు అనిత, కాంచన, కవిత, వరలక్ష్మి, సునీత, శ్రీదేవి, కాంచన, మాధురి, సరిత, సిఎంఆర్ చంద్రశేఖర్, కొడపగానిపల్లి రామాంజినేయులు, టీచర్ చంద్రమోహన్, రాఘవేంద్ర, ఫర్టిలైజర్ షాపు రాఘవ, నాగిరెడ్డిపల్లి ప్రసాద్, జగరాజుపల్లి వెంకటరాముడు శెట్టి, సి.ప్రసాద్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## నేడు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

**కొత్తచెరువు, జూన్ 11, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వుల మేరకు 2023–24 సంవత్సరానికి గాను నాలుగవ విడత జగనన్న విద్యాకానుక కిట్లను శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా అన్న ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2089 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 1,56,976 మంది విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలల్లో పంపిణీకి సిద్ధం చేసినట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రంగస్వామిలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పింపిణీ చేసే ఒక్కొక్క జగనన్న కిట్టులో మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక బ్యాగు, ఒక జత షూ, రెండు జతల సాక్సులు, బెల్ట్, డిక్షనరీ, నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు తదితర వస్తువులతో ఒక్కోకిట్టు విలువ రూ.2,500ల చోప్పున మొత్తం 1,56,976 కిట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం విద్యార్థులకు రూ.39.24 కోట్లు విలువ చేసే విద్యాకానుక కిట్లను పంపిణీ చేయనున్నట్లు డిఇఓ తెలియజేశారు.

# మల్లెల జయరాంతోనే వడ్డెర్లకు గుర్తింపు - వడ్డెర్ల సంఘం నాయకులు

ఓబుళదేవరచెరువు, జూన్ 11, ప్రభాతవార్త : వడ్డెర్లను ప్రధాన రాజకీయ పార్టీలు గుర్తిస్తున్నాయంటే అది మల్లెల జయరాం కృషి వల్లేనని పలువురు వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో మండల వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు ఆర్ఎంపి కిష్టప్ప, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులు కొలిమిరాల్లపల్లి సుధాకర్, జిల్లా ప్రచార కార్యదర్శి ఇడగొట్టు రమణల ఆధ్వర్యంలో వడ్డెర్ల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు మల్లెల జయరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో వడ్డెర్లు అత్యధికంగా ఉన్నారన్నారు. అయితే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓటు వేసే యంత్రాలుగా పరిగణిస్తూ వారితో ఓట్లు వేయించుకుంటున్నా రన్నారు. ఈ క్రమంలో 2012లో మల్లెల జయరాం వడ్డెర్ల స్థితిగతులను గుర్తించి వారిని చైతన్య పరిచి వడ్డెర్ల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. వడ్డెర్ల సంక్షేమం కోసం ఎన్నో కోట్ల రూపాయలను ఖర్చు చేసి వారి కష్టన ష్టాల్లో పాలుపంచుకున్న మహోన్నత వ్యక్తి జయరాం అన్నారు. గత 2014 సార్వ త్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసేందుకు నామినేషన్ దాఖలు చేశారన్నారు. వడ్డెర్ల ఓటు బ్యాంకును గుర్తించిన పల్లె రఘునాథరెడ్డి చంద్ర బాబు వద్దకు తీసుకువెళ్లి తెలుగుదేశం పార్టీలో వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించి ఎమ్మెల్సీ పదవి ఇస్తా మని హామీ ఇవ్వడంతో వడ్డెర్ల ఓతా ఎకతాటిపైకి వచ్చి పల్లె రఘునాథరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకున్నా మన్నారు.


వడ్డెర సంఘం నాయకులతో జయరాం

అయితే ఇచ్చిన హామీని నెరవేర్చ కపోయినా వడ్డెర్లు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నా రన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి శాసనసభ స్థానానికి మల్లెల జయరాం ప్రతిపాదనను తెలుగుదేశం పార్టీ అధిష్టానం పరిశీలించి అభ్యర్థిగా ప్రకటిస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా యూత్ అధ్యక్షులు నాగార్జున, వడ్డెర సాధికార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, రాష్ట్ర బీసి సెల్ ప్రధాన కార్యదర్శి జెరిపిటి అం జినప్ప, నాయకులు పల్లపు జయచంద్రమోహన్, కిష్టప్ప, రామచంద్ర, గంగా ధర, కేట వెంకటరమణ, కొత్తపల్లి రమణ, తిరుపాలు, శంకరప్ప, రమణప్ప, శివప్ప, నారాయణస్వామి, మహిళా సంఘం నాయకురాలు రమణమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చదరంగంలో వడ్డెర్లను బలిపశువులు చేస్తే చూస్తూ ఊరుకోను
## - వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం

ఓబుళదేవరచెరువు, జూన్ 11, ప్రభాతవార్త : ప్రధాన రాజకీయ పార్టీలు వడ్డెర్లను రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకుని బలిపశువులు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వడ్డెర్ల సంఘం కారా ్యల ంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 40 వేల ఓటు బ్యాంకు వడ్డెర్లు కలిగి ఉన్నారన్నారు. కాగా ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి తమను ఓటర్లుగా మార్చుకుని తరువాత వడ్డెర్ల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారన్నారు. ఇంత జనాభా కలిగి ఉన్న తమకు ఏ రాజకీయ పార్టీ కూడా గుర్తించకపోడం బాధాకరం అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీకి సిద్ధంగా ఉన్నానన్నారు. కావున వడ్డెర సోదరులందరూ కలసికట్టుగా తన గెలుపుకు కృషి చేయాలన్నారు. **పుట్ట పర్తిలో పరిశ్రమల స్థాప నకు పెద్ద పీట వేస్తా** : పుట్టపర్తి నియోజకంలో యువ తకు ఉపాధి కల్పనకు పెద్ద పీట వేసి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని వడ్డెర్ల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం హామీ ఇచ్చారు. ప్రస్తుత వైకాపా పాలనలో యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల వైపు పరుగులు పెడుతున్నారన్నారు. ప్రతి యేటా జాబ్ క్యాలండ్ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పాడని జగన్‌పాలనపై విమర్శలు గుప్పించారు.


మాట్లాడుతున్న మల్లెల జయరాం

## సిమెంట్ లారీని ఢీకొని దంపతులు దుర్మరణం

రాప్తాడు, జూన్ 11 ప్రభాతవార్త

అతివేగంతో వచ్చిన మహా సిమెంట్ లారీ ద్విచక్ర వాహ నాన్ని ఢీ కొన డంతో దంపతులు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ పివై ఆంజినేయులు తెలిపిన వివరాలు.. తమ బంధువులు అనారోగ్యం తో ఉండడంతో కనగానపల్లి మండలం మామిళ్ల పల్లి గ్రామానికి చెందిన కటిక ఓబులపతి (42) కటిక సరోజ (35) దంపతు లిద్దరూ ఏపి 02 ఏఎఫ్-2365 నెంబరు గల ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్తున్నారు. ధర్మవరం పంగల్ రోడ్డు దాటిన తర్వాత ఆర్డిటి స్టేడియం సమీ పంలోకి రాగానే వెనుక వైపు నుండి లారీని అతివేగంగా నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్ స్పీడ్ బ్రేకర్లను తప్పించడానికి యత్నించి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంతో గట్టిగా ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులిద్దరూ రోడ్డు పక్కకు ఎగిసిపడగా సరోజ అక్కడికక్కడే మృ తి చెందారు. భర్తకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద సంఘటన దృశ్యం

## గ్రంధాలయ వేసవి విజ్ఞాన శిభిరం ముగింపు

తనకల్లు, జూన్ 11, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని తనకల్లు శాఖా గ్రంధాలయము నందు గ్రంధాలయ అధికారి ఎస్. మస్తాన్ వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35 రోజుల వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) ముగింపు సందర్భంగా రిటైర్డ్ గ్రంధాలయ అధికారి ఎస్. ఇమామ్ సాబ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీ విద్యార్థులచే సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావే శంలో గ్రంధాలయ అధికారి మస్తాన్‌వలి మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞానం నిల్వ ఉన్న దేవాలయమని, విద్యార్థినీ విద్యార్థులు చిన్న వయస్సు నుండే వెళ్ళి అక్కడ ఉండే విజ్ఞానాన్ని సముపార్జించుకొని ఉన్నతంగా ఎదగాలని వక్తలు కొనియాడారు. విద్యార్థి దశలో గ్రంధాలయములు నావకు చుక్కాని వలే భవిష్యత్తులకు బాటలు వేస్తాయని గ్రంధాలయ అధికారి తెలిపారు. అనంతరం వేసవి విజ్ఞా న శిబిరంలో నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన, కథలు చెప్పిం చడం, క్రీడా పోటీలు వంటి మొదలగు పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథుల చేత బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, గ్రంధాలయ పాఠకులు, మండల ప్రజలు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న గ్రంధాలయ అధికారి మస్తాన్‌వలి

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందించిన రాప్తాడు ఎంపిపి

రాప్తాడు, జూన్ 11 ప్రభాతవార్త

రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి రాప్తాడు ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్ఫూర్తితో పేదలకు తన వంతు సహాయం చేస్తూ ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన భరసా ఇచ్చారు. ఎంపిపి సాయం చేయడంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.


సహాయం అందజేస్తున్న ఎంపిపి

## నేటి నుండి ఒంటిపూట బడులు

నల్లచెరువు,

జూన్ 11, ప్రభాతవార్త:

ప్రస్తుతం ఎండ తీవ్రత దృష్ట్యా నేటి నుండి అనగా 12.06.2023 నుండి 17.06.2023 వరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాలల సమయాల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి తిరుపాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి ఒక వారం రోజుల పాటు ఒంటి పూట బడుల సమయం ఉదయం 7:30 నుండి 11:30 వరకు మాత్రమే పాఠశాల నిర్వహణ ఉంటుందని, ఈ నిబంధనలు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ స్కూళ్ళకు వర్తిస్తుందని మండల విద్యాశాఖ అధికారి తిరుపాల్ నాయక్ తెలిపారు.


ఒంటిపూట బడుల సమయాలు తెలియజేస్తున్న ఎంఈఓ

## పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

యల్లనూరు,

జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆత్మీ య సమ్మేళనం కార్యక్రమా న్ని ఆది వారం ఘనంగా నిర్వహిం చుకున్నారు. తమకు విద్యాబు ద్దులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనం తరం పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకు న్నారు. వివిధ వృత్తులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాలలో తమ అనుబంధాలను స్మరించుకుంటూ కటుంబనేపథ్యం విషయాల గురించి చెప్పుకుంటూ సెల్ఫీలు దిగుతూ ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జంగంపల్లి ఓబు లేసు, కేశవ, రవి, రామాంజి, ప్రభాకర్‌రెడ్డి, చంద్ర, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

## ముగిసిన శిక్షణా తరగతులు

యాడికి, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, పాఠకులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా శ్రీసర స్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరం యొక్క ఆవశ్యకతను పాఠకులు వినియోగించుకున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని ఎంతో జ్ఞానాన్ని సంపాదిం చున్నారన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంద చేశారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి హేమశ్రీ, రెండవ బహుమతి శవరీష్, రన్నింగ్‌లో మొదటి బహుమతి పవిత్ర, రెండవ బహుమతి భరత్, మ్యూజికల్‌ఛైర్స్‌లో మొదటి బహుమతి తేజ, రెండవ బహుమతి నాగయశ్విత గెలుపొందారు. అలాగే ఉపాధ్యాయుడు కొత్తరా యుడుచే నలుగురు విద్యార్థులకు గ్రంథాల య శాశ్వత సభ్యత్వం ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, వెంకటేశులు, కొత్తరాయుడు, గ్రంథాలయ పాఠకులు వినయ్ కుమార్, చాంద్, కుమార్, సాయిరాం, లక్ష్మి నారాయణ, పురుషోత్తం, విరూపాక్షి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థికి బహుమతి అందచేస్తున్న దృశ్యం

## జూదరులు అరెస్ట్ - రూ.20 వేలు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, మోటర్‌సైకిళ్లు

యాడికి, జూన్ 11 ప్రభాతవార్త

యాడికిలో ఆదివారం జూదమా డుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి జూదమా డుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 20 వేల రూపాయల నగదు, 8 సెల్‌ఫోన్లు, 4 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిప్నారు.

## నేడు స్పందన కార్యక్రమం

యల్లనూరు, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమ వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీ ల్దార్ సుమతి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికా రులు తప్పనిసరిగా హాజరుకావాలని తహశీల్దార్ సూచిం చారు.


తహశీల్దార్ సుమతి

## అమడగూరులో గాలివాన బీభత్సం
### - నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు, చెట్లు
### - స్తంభించిన రాకపోకలు

అమడగూరు, జూన్ 11 ప్రభాతవార్త

మండలంలో గాలివాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు నేలకొరిగాయి. ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా గాలివాన పెద్దఎత్తున రావడంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, తహశీల్దార్ కార్యాలయం ముందర వున్న విద్యుత్ స్తంభంతో పాటు తుమ్మ చెట్లు నేలకొరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో రహదారిలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద వున్న ప్రధాన రహదారిపై తుమ్మ చెట్లు రహదారిపై పడడంతో కర్ణాటక నుండి వచ్చే ప్రయా ణీకులు, ఆంధ్ర నుండి వచ్చే ప్రయాణీకుల రాకపోకలు స్తంభించి పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలివాన బీభత్సానికి పండ్లతోటలైన మామిడి, అల్లనేరేడు, తదితర పంటలు పూర్తిగా నష్టపోయాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించాలని పండ్లతోటల రైతులు కోరుతున్నారు.


ఒరిగిన విద్యుత్ స్తంభం

# వారాహి యాత్రను ఆపడం వైసీపీ తరం కాదు
## - జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్

అనంతపురం అర్బన్, జూన్ 11 ప్రభాతవార్త

ప్రజల్లో జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక.. వారాహజ యాత్ర విజయవంతమైతే ఇక తమ చిరునామా గల్లంతే అవుతుం దన్న అక్కసుతో వైసీపీ వారాహిని ఆపేందుకు నానా పన్నాగాలు పన్నుతోంది. ఎన్ని కుయుక్తులు పన్నిన వారాహి యాత్రను ఆపడం వైసిపి తరం కాదని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన అధ్యక్షులు ఈ నెల 14 నుంచి అన్నవరం నుంచి ఉభయగోదావరి జిల్లాల్లో వారాహి యాత్ర సాగనుండటంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పోలీసుల అలర్ట్ అయి అమలాపురంపోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 10న అర్ధరాత్రి నుంచి 30వ తేది వరకు పోలీస్ సెక్షన్ 30 అమల్లో ఉంటుందని లీక్‌లు ఇస్తున్నారని మండి పడ్డారు. 14 నుంచి 28వ తేది వరకు కోనసీమ జిల్లాలో వారాహి యాత్ర నేపథ్యంలోనిషేధాజ్ఞలు అమలు చేస్తామని పేర్కొనడం వైసీపీ ప్రభుత్వ వెన్నులో వణుకుకు నిదర్శనం అన్నారు. జనసనకు వస్తున్న ఆదరణ చూసి వైసీపీ ప్రభుత్వం పోలీసులకు అడ్డుపెటు ్టకుని వైసీపీ ప్రభుత్వం వారాహిని ఆపాలను కోవడం వారి మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుయుక్తులు పన్నినా మడమ తిప్పని పవన్ కళ్యాణ్ వారాహిని ఆపే ప్రసక్తి లేదన్నారు. జనసైనికులంతా కలిసి వారాహి యాత్రను ప్రతిష్టాత్మకంగా విజయవంతం చేస్తామని భవాని రవికుమార్ పేర్కొన్నారు. ఇలాంటి విపరీత చర్యలు ఆపకపోతే వైసీపీ మూల్యం చెల్లిం చుకోక తప్పదని హెచ్చరించారు.


జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్

# శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి
## - పూజల్లో పాల్గొన్న యువపారిశ్రామికవేత్త కడపల శ్రీకాంత్‌రెడ్డి కుటుంబసభ్యులు

అమడగూరు, జూన్ 11 ప్రభాతవార్త

అమడగూరు మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారిని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అదేవిధంగా కడపలవారిపల్లి గ్రామానికి చెందిన యువపారిశ్రామికవేత్త కడపల శ్రీకాంత్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆదివారం శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆల యాన్ని బెంగుళూరు నుండి ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముం దుగా ఆలయ కమిటీ సభ్యులు యువపారిశ్రామికవేత్త కడపల శ్రీకాంత్‌రెడ్డి కటుంబసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలి కారు. అనంతరం వారు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు దేశాయినాగేంద్ర, కుమార్‌రెడ్డిలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పూజా కార్య క్రమానికి హాజరైన భక్తులకు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు విందుభోజనం ఏర్పాటు చేశారు.


కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం


శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పెద్దిరెడ్డి సురేందర్‌రెడ్డి

## వాసవిసేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగావైద్యశిబిరం

యాడికి, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీవాసవి దేవి కళ్యాణమండపంలో ఆదివారం శ్రీవాస విసేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. అనంతపురం (సహరి మల్లీ స్పెషాలిటీ ఆసుపత్రి) వారి ఆధ్వర్యంలో డాక్టర్ భానుకిరణ్, డాక్టర్ మాధవిలతలు వైద్యశి బిరానికి హాజరైన 200 మందికి బిపి, షుగర్, గైనిక్, ఈసిజి, లైఫ్‌సేవింగ్ ప్రొడక్షన్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్య క్రమానికి వచ్చిన వారికి సేవాసంఘం ఆధ్వర్యంలో భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్యవైశ్యసేవాసంఘం ఆధ్వర్యంలో వైద్యబృందాన్ని ఘనంగా సత్కరించారు.


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

## ముగిసిన సమ్మర్ క్యాంపులు

యల్లనూరు, జూన్ 11 ప్రభాత వార్త

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలు పొందిన వారికి ముఖ్య అతిథిగా హాజరైన సింగిల్‌విండో అధ్య క్షులు కిరణ్ కుమార్ బహుమతు లు అంద చేశారు. ఇందులో భాగం గా క్యారమ్స్ పోటీల్లో గురుదినేష్, ప్రణీత్‌లు మొద టి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చెస్‌లో ప్రణీత్ మొదటి బహుమతి, మ్యూజికల్ చైర్స్‌లో గురుదేవేంద్ర, జయలక్ష్మి, ఉమామహేష్‌లు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రకాష్‌రెడ్డి, కొండయ్య, రంగప్ప, ఓబులేసు, పాఠకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందచేస్తున్న దృశ్యం

# నేటి నుంచి మహిళలకు కేఎస్ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
## - శక్తి యోజన కింద స్త్రీ సబలీకరణ.... ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్... జిల్లా మంత్రి బి.నాగేంద్ర

బళ్లారి, జూన్11, ప్రభాతవార్త ; ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నేటి నుంచి కేఎస్ఆర్‌టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం యోజనను జారీలోకి తీసుకొచ్చిందని, మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మంత్రి, రాష్ట్ర యువజన సేవలు, క్రీడాశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి బి.నాగేంద్ర పిలుపునిచ్చారు. బళ్లారి నూతన ఆర్టీసీ బస్టాండులో ఆదివారంనాడు మహిళల ఉచిత ప్రయాణ సౌలభ్యం కల్పించే శక్తి యోజనను ప్రారంభించి మాట్లాడారు. ఈ శక్తి యోజన బళ్లారిలో తాను ఇన్‌చార్జి మంత్రిగా అయిన సందర్భంలో తన రాజకీయ జీవితంలో అత్యంత మహత్తరమైన మొదటి కార్యక్రమం ఇదేనని పేర్కొన్నారు. ఇటువంటి ఒక కార్యక్రమం జారీలోకి తీసుకొచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు. దిననిత్య అవసరాల కోసం, వ్యాపారాల కోసం, చదువుల కోసం మహిళలు, విద్యార్థినీలు బస్సుల్లో చార్జీలు వెచ్చించి సంచారం సాగించే వారని, ఇప్పుడు అటువంటి ఇబ్బంది పడకుండా మహిళలందరూ ఫ్రీగా రాష్ట్రంలో యథేచ్ఛగా ఉచితంగా కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగించవచ్చునని చెప్పారు. నేడు రాష్ట్రంలో మహిళలందరికీ ఒక పండగ దినమని, రాష్ట్రంలోని నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం, మహిళల సబలీకరణ కోసం బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేందుకు గతంలో ఏ ప్రభుత్వం చేయని సాహసోపేత యోజనను జారీలోకి తీసుకొచ్చిందని, మహిళలందరికీ అత్యంత సంతోషకరదినం ఈరోజేనని చెప్పారు. డబ్బులు లేక ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బందిపడే మహిళా మణులకు స్వేచ్ఛాయుత సంచారం బస్సుల్లో చేసేందుకు సిద్ధరామయ్య ప్రభుత్వం మహిళలకు అవకాశం కల్పించడం యావత్ భారతదేశంలో కర్ణాటకలో జరుగుతుండడం అభినం దనీయమని తెలిపారు. దేశంలోనే ఈ యోజన అపురూపమైన యోజన అని, దేశప్రజలంతా రాష్ట్రం వైపు చూసే సందర్భం ఇది అని, మహిళలకు ప్రయాణం ఉచితం అయినందున వారి వెంట వచ్చే పురుషుల జేబుల్లో డబ్బు కూడా ఆదా అవుతుందని, ఈ యోజనను మహిళలు సక్రమంగా వినియోగించుకోవాలని, మీడియా వారు కూడా ఈ యోజన గురించి విమర్శనాత్మక ధోరణితో వ్యవహరించకుండా మహిళలు సురక్షితంగా, సాఫీగా బస్సుల్లో ప్రయాణంసాగించేలా అవగాహన కల్పించాలన్నారు. బళ్లారి జిల్లా సమగ్రా భివృద్ధికి తనతో పాటు తమ నాయ కులు, ప్రజాప్రతినిధులు, సార్వజనికుల సహకారం అందించాలని, ముఖ్య ంగా అధికారులు గతంలో ఎలా పని చేశారో తనకు తెలియదని, అయితే ఇకపై అందరూ అభివృద్ధి విషయంలో తనకు పూర్తిగా సహకారం అందిం చాలని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సయ్యద్‌నాసీర్‌హుసేన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో తమ కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని, ప్రజలు కూడా అంతే నమ్మకంతో తమకు మెజార్టీ స్థానాలతో గెలిపించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా చేశారు. జిల్లాలోని ఐదు క్షేత్రాల్లో కాంగ్రెస్ గెలిచిందని, మేము ఇచ్చిన హామీలు జారీలోకి తీసుకొచ్చే సమయం ఇదే. కాంగ్రెస్ మొదటి నుంచి నిరుద్యోగుల, దుర్బరుల పరంగా ఉన్న ఏకైక పార్టీ అని, ఈ నేపథ్యంలో శక్తియోజన లాంటి, ఒక బృహత్తర కార్యక్రమాన్ని జారీలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం మహిళలు, వ్యాపారం చేసుకునేందుకు వెళ్లే మహిళలు, స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినీలకు, సామాన్య మహిళలకు కూడా శక్తియోజన కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎంతో అనుకూలమవుతుందని చెప్పారు. డీఎంఎఫ్ నిధి కింద బళ్లారికి ఆరు కొత్త ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి బళ్లారి ఆర్టీసీ డిపో వారికి కేటాయించినట్లు, కేకే ఆర్‌డీపీ నిధి కింద కూడా 60 నూతన బస్సులను బళ్లారి డిపో పరిధికి కొనుగోలు చేయనున్నట్లు, తమ నాయకుడు రాహుల్‌గాంధీ బళ్లారి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బళ్లారిని జీన్స్ రాజధా నిగా రూపొందిస్తున్నట్లు, ఇం దుకు బళ్లారి ప్రజల సహకారం అత్యావశ్యకమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడిన బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తాను ఎమ్మెల్యేగా గెలిచి పాల్గొంటున్న మొదటి కార్యక్రమం శక్తియోజన కార్యక్రమమని, తమ కాంగ్రెస్ పార్టీకి మహిళల ఆశీర్వాదం ఉన్నదని, ఈ యోజన గురించి బీజేపీ తదితర పార్టీలు అపహా స్యంగా మాట్లాడారని, నేడు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తున్నామని, ఇది గమనించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను తప్పకుండా నెరవేరుస్తుందని, అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీసీఎం డి.కె.శివకుమార్ నేతృత్వంలో కర్ణాటకలో ఉత్తమపాలన జరుగుతుందన్నారు. మహిళలకు శక్తి యోజన కింద బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు త్వరలో స్మార్‌కార్డులు పంపిణీ జరుగుతుందని, అంతవరకు బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీలు మాత్రం చూపిస్తే చాలునని, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు తిరుగాడే పని లేకుండా నగరంలో వార్డు సభ్యులు, ఎమ్మె ల్యేలు తనకు గానీ, మంత్రి నాగేంద్రకు గానీ నేరుగా వినతి పత్రాలు అంద జేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాధికారి పవన్‌కుమార్ మాల పాటి, ఏఎస్పీ నటరాజ్, బళ్లారి ఆర్టీసీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




బళ్లారిలో శక్తి యోజన కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తున్న జిల్లా మంత్రి బి.నాగేంద్ర

## బుడా కార్యాలయంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భేటీ

బళ్లారి, జూన్11, ప్రభాతవార్త ; బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికారం(బుడా) కార్యాలయాన్ని నూతన ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సందర్శించి అధికారులతో బుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రెండు గంటలపాటు సుధీర్ఘంగా చర్చ జరిపారు. నగరంలో నివాసయోగ్య నూతన లేఅవుట్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రింగు రోడ్డు తదితర పనులకు సంబంధించి బుడా అధికారుల నుంచి సమాచారం పొందారు. ఇదే సందర్భంలో వారికి అభివృద్ధి యోజనలు కుంటు పడకుండా వేగవంతంగా కార్యాచరణ జరిగేలా చూడాలని సూచించారు. అవసరమైతే తన సహకారం తీసుకోవాలని, అభివృద్ధి విష యంలో ఎటువంటి పరిస్థితిలోనూ వెనుకంజ వేసేదేలేదని తెలిపిన ఆయన, నగరంలోని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం అండర్‌పాస్ విస్తరణ పనుల గురించి కౌల్‌బజార్-రేడియోపార్కు సెకండ్ గేట్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల గురించి అధికారులతో చర్చించి సమాచారం పొందారు. నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధిపరచాలని సూచించిన ఆయన, అధికారులు, సిబ్బంది బుడా అప్రూవల్ కోసం వచ్చే సార్వజనికులకు ఎటువంటి ఆలస్యం చేయ కుండా వారికి త్వరితగతిన అప్రూవల్ దక్కేలా చూడాలని, ఇటువంటి పరిస్థితుల్లోనూ కార్యాలయంలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని, తనదృష్టికి వస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంలో నారా భరత్‌రెడ్డిని బుడా అధికా రులు సత్కరించి అభినందనలు తెలిపారు. బుడా కమిషనర్ రమేష్‌కుమార్, నగర యోజనావిభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బుడా కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

## నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

యాడికి, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పంచా యతీ కార్యాలయం ఆవరణలో సోమవారం వైకాపా మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. గుండెనొ ప్పి, చాతినొప్పి, గండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలో మంట కలగడం, చాతిలో బరువుగా వుండడం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చో వడం, కళ్లు వాపురావడం, చెమటలు పట్టడం, తదితర లక్ష ణాలకు వైద్యనిపు ణులు వైద్యపరీక్షలు నిర్వహి స్తారని బొంబాయి రమేష్‌నాయుడు తెలిపారు. ఈ శిబిరంలో జిఆర్‌పి ఎస్2 డి ఎకో ఉచితంగా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్యశిబిరానికి హాజరయ్యే వారు మాస్క్ ధరించి, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని ఆయన తెలిపారు.


బొంబాయి రమేష్‌నాయుడు

# మాజీ సైనికులకు భూ కేటాయింపులు ఏవి..?

## - భూములు అన్యక్రాంతం అవుతుంటే అధికారులు స్పందించరేమిటి..?
## - సమావేంలో అధ్యక్షులు షేకన్న ధ్వజం

అనంతపురం, జూన్ 11 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘ రిజిస్టర్ నెంబర్ (118/1982) సమావేశం ఆదివారం అనంతపురం పట్టణంలోని హెచ్ఎల్సి కాలనీలోని వీకే భవన్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ సైనికుల ముఖ్య సమస్య లపై అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సైనికులకు కేటాయించిన భూ ములు అన్యాక్రాంతమైపోతుంటే ప్రభుత్వ అధికారులు సహకరించకుండా మా జీ సైనికులకు భూ కేటాయింపులు సరిగా జరగడం లేదని వాపోయారు. దీని మీద శ్రద్ధ చూపించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరడం జరిగింది. సం ఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు కొరకు నోటిఫికేషన్ ఇచ్చే సమయంలో మాజీ సైనికుల కోటా కింద రెండు శాతం రిజర్వేషన్ ప్రకారం క్వాలిపై మార్కులను ఎస్సీ, ఎస్టీలకు సమానంగా నోటి ఫికేషన్ లోనే జారీ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అర్హులైన మాజీ సైనికులకు వెంటనే ఉద్యోగ కల్పన చేయించాలని కోరడం జరిగింది. ఎడ్యుకే షన్ సీట్ల రిజర్వేషన్లలో ఇప్పుడున్న రెండు శాతానికి మరొక శాతం కోటా పెంచి మాజీ సైనికుల పిల్లలకు ఉన్న విద్య నందించడంలో తోడ్పాటు నందిం చాలని కోరడమైనది. ము ఖ్యం గా వైద్య విద్యలో ఇప్పు డున్న ఒక శాతం రిజర్వే షన్ను రెండు శాతం మార్చాలని ప్రభు త్వానికి విజ్ఞప్తి చేయడమైంది. సైనిక పురంలో సామాజిక అటవీ శాఖ వారిచే మొక్కలు నాటే కా ర్యక్ర మాన్ని త్వరలో చేపట్టిపోతు న్నాము. ఈ నెల 18వ తారీఖున సంఘం యొక్క సర్వ సభ్య సమావేశం నిర్వహించుచున్నందున, రాష్ట్ర వ్యాప్తంగా అఖిలపక్ష మాజీ సైనికుల సమావేశంలో లేవనె త్తాల్సి న సమస్యల గురించి, ప్రభుత్వంతో చేపట్టాల్సి న మాజీ సైనికుల సమస్యల గురించి చర్చి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వికె రంగారెడ్డి, సం ఘ ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమా మహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మా రెడ్డి, కుమారస్వామి, బషీర్ అహ్మద్, జంగం శెట్టి సురేష్, నాగిరెడ్డి, బిప హుస్సేన్, ఈశ్వరయ్య, మహమ్మద్ గౌస్, వై.ప్రసాద్, నరసింహులు, మహబూబ్ బీరా, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేకన్న

## గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల ముగింపు

అనంతపురం, జూన్ 11 ప్రభాతవార్త బ్యూరో

వేసవి సెలవులను పురస్కరిం చుకుని గ్రంథాల యాల్లో విద్యా ర్థులకు నిర్వహించిన 35 రోజుల వేసవి శిక్షణ తరగతులు ఆదివా రంతో ముగిశాయి. ఈ సంద ర్భంగా విద్యార్థినీ, విద్యా ర్థు లకు డ్రాయింగ్, ఇంగ్లీష్ రైటి ంగ్, మ్యూజిక్ చైర్స్ లలో పో టీలు నిర్వహించారు. ప్రథ మ, ద్వితీ, తృతీయ బహుమ తులను అందజేశారు. ముగింపు కార్యక్ర మా నికి ముఖ్య అతిథులుగా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎం. ఉమామోహన్‌రెడ్డి, కార్య దర్శి రమా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్.ఎం.మోహన్‌రె డ్డిలు హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రం థాలయాలను సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈనాడు సెల్ ఫోన్ల వల్ల పిల్లలు వీడియోగేమ్స్, చాటింగ్స్, ఫేస్‌బుక్ వాటిపై ఆకర్షి తులై తమ విలు వైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ఇవి విద్యార్థుల జీవితా ల ను నాశనం చేస్తున్నాయన్నారు. కనుక విద్యార్థులు సమయం దొరికిన ప్పు డల్లా మీకు దగ్గరలో ఉన్న గ్రంథా లయాలకు వెళ్లి పత్రికలు, పురాతన గ్రం థాలు, మ్యాగ్‌జైన్స్, తిరగేస్తూ విజ్ఞానాన్ని సంపాదించు కోవాలన్నారు. అనం తరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు గ్రంథాల యా ధికారి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో గ్రంథా లయ సహాయకురాలు జి.ప్రవ ల్లిక, ఎం.అంజలి, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ముగింపు కార్యక్రమాలను దిగ్విజయంగా చేశారు.



గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల ముగింపులోని దృశ్యం

## ఆంగ్ల మాధ్యమంలో బోధనపై అధ్యాపకులకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 11 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభు త్వ కళాశాలల్లో డిగ్రీ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించెం దుకు, అధ్యాపకులకు మూడు విడతలుగా శిక్షణ కార్యక్ర మాన్ని నిర్దేశించారు. కళాశాల కమిషనర్ డా.పోలా భాస్కర్ ఇందులో భాగ ంగా మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్ర మాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభి స్తూ, అధ్యాపకులు ఇంగ్లీష్ మీడియంలో బోధనా నైపుణ్యాలు పొంది చుకుని విద్యార్థుల సర్వతో ముఖా భివృద్ధికి కృషి చేయాలని మార్గ దర్శనం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో, జూన్ 5 ప్రారం భమైన మొదటి బ్యాచ్ శిక్షణ 10వ తేదిన ముగిసింది. ఈ సందర్భంగా కళా శాల ప్రిన్సిపాల్ డా.దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తలపెట్టిన ఈ శిక్షణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇంగ్లీష్ మీడియం బోధనలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని కోరారు.



శిక్షణలో అధ్యాపకులు

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శింగన మల గ్రంథాలయ శాఖలో నిర్వ హించిన వేసవి శిక్షణ తరగ తు లు ఆదివారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి కృష్ణ తెలి పారు. ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ మే 8వ తేది నుంచి జూన్ 11వ తేది వరకు 35 రోజులు గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఆయన పేర్కొ న్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా వైస్ సర్పంచు పి.లక్ష్మి నారా యణరెడ్డి, వెంకటరమణ, అనిల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ తరగతుల పోటీల్లో పాల్గొన్న 30 మంది విజేతలకు వారు బహుమతు లుగా రైటింగ్ ప్యాడ్, బాక్సులు, పెన్ను లు పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ రంగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## ఆదిని పరామర్శించిన ద్విసభ్య కమిటీ సభ్యులు

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయప డిన టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణను ఆదివారం ద్విసభ్య కమిటీ సభ్యు లు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడులు, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, తెలు గు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పరామర్శించారు. ఈ సందర్భ ంగా వారు ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. శింగనమల నుంచి అనంతపురం వెళ్తుండగా మార్గ మధ్య లో నారాయణకుంట వద్ద బైకు అదుపుతప్పడంతో కిందపడి గాయాలైనట్లు ఆదినారాయణ తెలిపారు. వారి వెంట టిడిపి నేతలు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, శ్రీనివాసులు గౌడ్, బండి పరుశురామ్, బెస్త నారాయణస్వామి, అనంతనేని చౌదరి, కాయల సురేష్‌యాదవ్, దేరంగుల శంకరయ్య, పోతులయ్య, రంగస్వామి, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, వడ్డె పవన్ తదతరులు పాల్గొన్నారు.



ఆదినారాయణను పరామర్శిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

## వైవిబి.రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించిన దేగల

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

పంచాయితీ రాజ్ వ్యవస్థాపక అధ్యక్షు లు మాజీ ఎమ్మెల్సీ వైవిబి. రాజేంద్రప్ర సాద్‌ను ఆదివారం కృష్ణ జిల్లా ఉయ్యూ రు గ్రామంలో రాష్ట్ర పంచాయి తీరాజ్ శాఖ సభ్యులు దేగల కృష్ణమూర్తిలు కలి శారు. గుండె సమస్యతో విజయవా డలో ని రమేష్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఈరోజు తన సొంత గ్రామంలో విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఇంటికి వె ళ్లి రాష్ట్ర పంచాయి తీరాజ్‌శాఖ సభ్యులు దేగల కృష్ణమూర్తి, వేలూరు రంగయ్య, వీరేష్ తదితరులు ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.



వైవిబి.రాజేంద్రప్రసాద్‌తో దేగల

## అన్ని పంటలకు ఖరీఫ్-2022 పంటల భీమాను వెంటనే ప్రకటించాలి - ఏపి రైతు సంఘం నేతల డిమాండ్

అనంతపురం, జూన్ 11 ప్రభాతవార్త

ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ గణేష్ నాయక్ భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జూన్ 17 నుంచి 19 వరకు రైతు భరోసా కేంద్రాల వద్ద నిరసనలు 18 నుంచి 23 వరకు ఎంఆర్ఓ కార్యాలయం ముం దు ధర్నాలు జూన్ 30 ఛలో విజయవాడ రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఖరీఫ్-2022లో అతివృష్టి అనావృష్టి వల్ల అన్న రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేరుశనగ పత్తి, మిరప, కంది పొలాల్లోనే కుళ్లాపోయి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి దిక్కుతోచని పరిస్థితు ల్లో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, విటి రామాంజినే యులు, విరుపాక్షి, రాజారామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, రాముడు, వెంకట్‌చౌదరి, సుంకన్న, చిదంబరమ్మ, నారాయణరెడ్డి, వెంకట కొండ, కొండారెడ్డి, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నేతలు

## ప్రజా రక్షణకు సీసీ కెమెరాలే కీలకం

### - నగరమేయర్ మహ్మద్ వసీం

అనంతపురం, జూన్ 11 ప్రభాతవార్త

నగరంలో ప్రజారక్షణకు సిసి కెమెరాలు కీలకంగా పనిచేస్తా యని నగర మేయర్ మహ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 44వ డివిజన్ పరిధిలోని 3వ రోడ్డు 11వ స్ట్రీట్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన 5 సిసి కెమెరా లను ఆదివారం నగర మేయర్ మహ్మద్ వసీం ప్రారం భించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటం కోసం ప్రభుత్వం వారే వెయ్యాలనేది కాకుండా స్థానికులే ముందస్తు జాగ్రత్త పాట ిస్తూ స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీ యమ న్నారు. కెమెరాలు ఏర్పాటు చేసిన త్రీ టౌన్ ఏఎస్ఐ రాజాప్రసాద్, అడ్వకేట్ వహదుల్లా ఖాన్‌లతోపాటు స్థానికులకు ఈ సందర్భంగా మేయర్ వసీం అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు శాంతి సుధా, ఇషాక్, కమల్‌భూషణ్, కో ఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు దాదాఖలందర్, మధు, జీలాన్, సచివాలయం కన్వీనర్ నస్రిన్, స్థానికులు తదతరులు పాల్గొన్నారు.



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, తదితరులు

## వివాహ వేడుకకు హాజరైన దండు శ్రీనివాసులు

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అనంతపు రం పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పొగా కుల మహబూబ్‌బాషా కుమా రుడు అల్లాబకాష్ వివాహ వేడు కకు మండల కేంద్రంలోని శింగ నమలలో ఆదివారం తెలు గు యువత రాష్ట్ర అధికార ప్రతి నిధి దండు శ్రీనివాసులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆ యన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు సి.వెంకటేష్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బండి పరుశురామ్, బిసి సెల్ బండి పరు శురామ్, అనంతనేని చౌదరి, బెస్త నారాయణస్వామి, తలారి తిప్పన్న, కాయల సురేష్‌యాదవ్, బండి వెంకట నారాయణ, మసూద్‌వలి, ముంతా వెంకటేష్, అట్టె శీన, ప్రసాద్‌నాయక్, రంగస్వామి, జంగంశెట్టి నవీన్, శంకర్ నారాయణ, రాచేపల్లి జయరాముడు, మెండం శివయాదవ్, కాలయ శివశం కర్‌యాదవ్, రాజు, బాబావలి, టైలర్ ఇస్మాయిల్ బోయ నరేష్, మహ్మద్, రామకృష్ణ, సోము తదితరులు పాల్గొన్నారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న దండు శ్రీనివాసులు

## సర్పంచు సాకే నరసమ్మ పై ఆరోపనలు తగవు

బుక్కరాయసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండ లం రెడ్డిపల్లి గ్రామ పంచా యితీ సర్పంచు సాకే నరసమ్మ పై ఆరోపనలు చేయడం తగదు. కొందరు పంచాయితీలో జరుగు చున్న అభివృద్దిని చూసి ఓర్వలేక మాపై తప్పుడు ప్రచా రం చేస్తున్నారని సర్పంచు సాకే నరసమ్మ, వారి భర్త సాకే నారా యణస్వామి తీవ్రంగా ఖండించారు. ఆదివారం రేకులకుంట గ్రామంలోని వారి నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్ల డుతూ రెడ్డి పల్లి పంచాయితీలో మూడుగ్రామాలు ఉన్నాయి రెడ్డిపల్లి, అమ్మవా రిపేట, రేకులకుంట గ్రామాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్దికి ఎంతో కృషిచే శాం, ఈ పంచాయితీ ప్రజలు మా మీద నమ్మకంతో 2001 సంవత్స రంలో నన్ను సర్పంచుగా గెలిపించారు. 2014 లో టిడిపి ప్రభుత్వంలో టిడిపి నాయకులు ఓటర్లను ఎంత ప్రలోబాలు పెట్టినా మా కుటుంబం మీద విశ్వా సంతో మా కోడలు ఆదిలక్ష్మి కి ఎంపిపి పదవి కట్టబెట్టారు. 2020లో సాకే మల్లికార్జున శింగనమల మార్కెట్‌యార్డ్ చైర్మన్, 2021లో నరసమ్మ సర్పం చుగా ఎన్నుకు న్నారు, మా కుటుంబం పై ప్రజలు ఎంతో విశ్వాసంగా ఉన్నా రు. ప్రజల రుణం తీర్చుకోవడానికి మా వంతు కృషిచేస్తు న్నాం. కరోనా సమయంలో లాక్‌డౌన్ విదించిన సమయంలో ప్రజలను ఆదుకోవడానికి మాకు తోచిన విదంగ నిత్యవసర సరుకులను పంపిణీచేయడం జరిగింద న్నారు. మా పై కొందరు గిట్టనివారు లంచం తీసుకున్నారని తప్పుడు ప్రచా రం చేస్తున్నారు. మేము ఆశా వర్కర్ పోస్టుకి లంచం తీసుకున్నామని నిరూ పిస్తే ఏ గుడిదగ్గరకైనా వచ్చి ప్రమాణంచేస్తామని సవాల్ విసిరా రు. అనం తరం ఆశా వర్కర్ ధనలక్ష్మి మాట్లడుతూ నేను వాలంటరీగ ఉన్న నేను ఆశా వర్కర్ పోస్టుకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దానికి నేను దరఖాస్తు చేసుకు న్నాను నాతోపాటి చాలామంది అప్లయిచేసుకున్నారు. అందులో మెరి ట్‌ను బట్టి నాకు ఈ పోస్టు వచ్చింది. నేను ఎవ్వరికి లంచం ఇవ్వలేదు. ఇచ్చే స్థోమ తకూడ నాకులేదు నేను కూలిపనికి పోయి మా కుటుంబాన్ని పోసిం చుకుంటున్నాను. మా సర్పంచు పై తప్పుడు ఆరోపనలు తగవన్నారు.



మాట్లడుతున్న సర్పంచు నరసమ్మ

# టిడిపి నుండి వైసిపిలోకి చేరికలు

నల్లచెరువు, జూన్ 11, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సంజీవపల్లికి చెందిన టిడిపి నాయకులు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి తీర్థం పుచ్చుకొని పార్టీలోకి చేరడం జరిగింది. టిడిపి పార్టీ నుండి వైసిపి పార్టీలోకి చేరిన వారు శంకర్ నాయుడు, లోకేష్‌నాయుడు, కేశవనాయుడు, ఇంద్రసేన నాయుడు, రామ స్వా మి నాయుడు తదితరులు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వీరిని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పార్టీ కండువ కప్పి సాధరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్దిని, సంక్షేమ పథకాలను చూస్తే ఎవరికైనా గౌరవం పెరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో టిడ పి పార్టీకి కార్యకర్త అన్నవారు ఏ ఒక్కరూ కూడా ఉండబోరన్నారు. రాష్ట్ర ంలో అభివృద్ది అంటే ఏమిటో జగన్‌మోహన్‌రెడ్డి చూపించారని, వారు చేసిన సేవలకు ప్రజలు మంత్రముగ్ధులయ్యారన్నారు. కులం, మతం, పార్టీ అన్న తేడా లేకుండా ప్రతి ఒక్క లబ్దిదాం ునికి లబ్ది చేకూర్చడమే లక్ష ్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తున్నద న్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో మరెన్నో మంచి కార్యక్రమాలు చేపడతారని, జగనన్నకు ప్రజలు ఎల్లవేళలా తోడు ఉండాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి హితవు పలి కారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిటి సిలు, సర్పంచ్‌లు, కోఆ ప్షన్ సభ్యులు, జేసిఎస్ ఇన్ చార్జ్ లు, వివిధ శాఖల చైర్మెన్‌లు, డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతి నిధు లు, సోషల్ మీడియా సోద రులు, పోలింగ్ బూత్ మేనేజర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సార థు లు, కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైసిపి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

## దేశాభివృద్ధికి తోడ్పాటును అందించాలి

### - ఎంఈఓ జయానాయక్

పామిడి జూన్ 11 ప్రభాతవార్త

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని క్రమశిక్షణతో కూడిన విద్యనభ్య శిస్తూదేశాభి వృద్ధికి తోడ్పాటును అందించా లని ఎంఈఓ జయానాయక్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో 35 రోజులు పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ చిన్నారుల్లో వ్యక్తిత్వాన్ని పెంపొందించి సత్ప్రవర్తన కల్పించటానికి వేసవి విజ్ఞాన శిబిరం ఎంతోగానో దోహదపడిందని తెలిపారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. చదువే అన్నింటికి మూల మని చదవు లేకపోతే బ్రతుకులన్నీ సున్నాగానే మిగిలిపోతాయని అందువల్ల మీరంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యశిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకుని జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యనభ్యశించిన పాఠశాలకు మంచి గుర్తింపును తీసుకురా వాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొ ందిన విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో గ్రాంథాలయ అధికారి వెంకటలక్ష్మి, జగదీష్, లీలా, మనోహర్, సురేష్, ఆల్తా ఫ్, గ్రంథాలయ పాఠకులు విద్యార్థినీ. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోటోల్లో గెలుపొందిన విజేతలతో ఎంఈఓ జయానాయక్

## గ్రంథాలయం ఆధ్వర్యంలో ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

బుక్కరాయసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గ్రంథాలయశాఖ న ందు విద్యార్థులకు ఇస్తున్న సు దీర్ఘ వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయని గ్రంథాలయ శాఖ అదికారి విజయభాస్కర్ తెలి పారు. ఈవేసవి శిబిరాలు మే 8తేదినుండి జూన్ 11 కు దాదాపు 35 రోజులు నిర్వహిం చడం జరిగింది. ఇందులో విద్యార్థులకు కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు చెపుట, ఆటలు, క్యాలంబోర్డు, చెస్, పాముపటం, యోగ, డ్యా న్స్ మెదలగు కార్యక్రమాలు నిర్వహించడం అయినది. ముగింపు కార్యక్రమానికి ము ఖ్య అథితులుగా సత్యనారాయణ రిటైడ్ గ్రంథాలయశాఖ అదికారి, ప్రసాద్, గ్రంథాలయ శాఖ అదికారి విజయభాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతు విద్యార్థులు గ్రంథాల యా లను ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తకాలు చదవటం కొరకు ఎక్కువ సమయం కేటాయించలన్నారు. విద్యార్థు లతోపాటు ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలు అందు బాటులో ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి ప్రతి రోజు కనీసం ఒక గంట సేపు గ్రంథాలయంలో గడపాల న్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న అదికారులు

## పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావటం తధ్యం

### - వారాహీ యాత్ర జయప్రదం కావాలని సర్వమత ప్రార్థనలు

పామిడి జూన్ 11 ప్రభాతవార్త

భవిష్యత్ జనసేన పార్టీదే పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావ డం తధ్యం అని ఆపార్టీ నాయ కులు పేర్కొన్నారు. ఈ నెల 14న జనసేనపార్టీ అధినేత పవన్‌కళ్యా ణ్ ప్రారంభిస్తున్న వారాహి యాత్ర జయప్రదం కావాలని ఆపార్టీ శ్రేణులు ఆదివారం స్థానిక పంచముఖ అంజనేయస్వామి, దస్తగిరి జెండాకట్టకు 101 టెంకా యలును సమర్పించి సర్వమత ప్రార్థనలు చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాబోవు ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించి ప్రత్యా మ్నయ శక్తిగా రూపుదిద్దుకుంటుందని తద్వార పవన్ కళ్యాణ్ ముఖ్య మంత్రి పదవి అధిరోహిస్తారని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు రోషన్ జమీర్, రాము, వేణు, అబ్దుల్, ఖాజా, వినోద్, షేక్షావలి, బాస్కర్, శరత్, సూర్య, లాలు తదితరులు పాల్గొన్నారు.



దస్తగిరి జెండాకట్టకు 101 టెంకాయలను సమర్పిస్తున్న జనసేనపార్టీ శ్రేణులు

## వివాహ వేడుకకు హాజరైన బండారు శ్రావణిశ్రీ



వధువరులను ఆశీర్వదిస్తున్న బండారు శ్రావణిశ్రీ



కార్యకర్తలతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తెలు గుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అనంతపురం పార్లమెంట్ మైనార్టీ కార్యనిర్వహక కార్యదర్శి పొగా కుల మహబూబ్ బాషా కుమా రుడు అల్లా బకాష్ వివాహ వేడుకకు ఆదివారం శింగన మలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మాజీ జడ్పిటిసి షాలినీ, టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చితంబర దొర, పెరవలి చిదానందనాయుడు, జీసి.బాబు, గుర్రం లక్ష్మినారా యణ, దాదులూరు కృష్ణరెడ్డి, మారుతి, బోయ సత్తి, కురాకు రాముడు, సో దనపల్లి రామాంజినేయులు, రహంతుల్లా, అక్బర్, ఫకృద్దీన్, జడేజా, రాజ శేఖర్‌యాదవ్, బాలకృష్ణ యాదవ్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## తాళిబొట్టు (బంగారు) చైను అపహరణ

శింగనమల, జూన్ 11 ప్రభాతవార్త

మండల పరిధజలోని చక్రాయిపేట పంచాయితీ శివ పురం గ్రామంకు, చెందిన రొద్దం నాగరత్నమ్మ వైఫ్/ ఆఫ్ నారాయణరెడ్డి, అను ఆమె శింగనమల మరువ కొమ్మ సమీపంలో, తన తోట వద్ద నల్ల రేగడి కాయలు అమ్ము తుండగా, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట లోపల, గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కాయలు కావాలని అడిగి కాయలు తూకం వేస్తుండగా, వెంటనే మెడలోని తాళిబొట్టు బంగారు చైన్ లాక్కుని వెళ్లాడు. బాధితు రాలు వెంటనే శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.



రొద్దం నాగరత్నమ్మ

## వివాహ వేడుకకు హాజరైన మంత్రి



నూతన వధువరుల తో మంత్రి ఉషాశ్రీ చరణ్

బ్రహ్మసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త

కర్ణాటక రాష్ట్రం చిత్రగుర్గంలో జరిగిన బ్రహ్మసముద్రం మండలం జడ్పిటిసి ప్రభావతమ్మ కూతురు పూజ త్యాగేరాజన్ వారి వివాహ వేడుకల్లో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్ దంపతులు, నియోజ కవర్గ నాయకులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

## శ్రీజగన్నాథ రథయాత్ర బ్రోచర్ ఆవిష్కరణ

అనంతపురం ఓల్డ్‌టౌన్, జూన్ 11 ప్రభాతవార్త

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీజ గన్నాథ రథయాత్ర మహో త్సవ బ్రోచర్లను నగరంలోని ఇస్కాన్ గోశాలలో ఆదివారం ఆవిష్కరిం చారు. ముఖ్యఅతి థులుగా ఆర్డీఒ మధుసూదన్, ఇస్కాన్ ఆలయ చైర్మన్ దామో దర గౌరంగదాసు, గోశాల ఇన్‌చార్జ్ సుధీర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ దామోదర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం 23వతేదిన ఇస్కాన్ ఆలయంలో సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24న పూరి నుండి తెప్పించినటువంటి మూల విరాట్లను శ్రీజగన్నాథ రథయాత్రలో భక్తుల దర్శనార్థం వుంచి శోభాయాత్రను స్థానిక కెఎస్ఆర్ కళాశాల నుండి నగరంలోని ప్రధాన కూడలి ద్వారా భక్తుల దర్శనార్థం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊరేగింపునకు వివిధ కళాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా వాసులందరూ ఈ బృహత్తర మహోత్స వంలో పాల్గొనాలని ఆయన కోరారు.



శ్రీజగన్నాథ రథయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఒ మధుసూదన్

## గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు

ఆత్మకూరు, జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయం నందు విద్యార్థుల కు 35 రోజుల పాటు నిర్వహిం చిన వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్య క్రమం గ్రంథాల యాధికారి నల్ల మ్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సమావేశానిక ముఖ్య అధిదిగా ఎంపిపి హేమల త హాజరెన్నారు. ఈ సందర భ ంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థి, వి ద్యార్థిని లు చిన్నతనం నుండి గ్రంథాలయంనకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలిపారు. గ్రంథాలయం ఒక జ్ఞాన మందిరమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు ఎంపిపి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం

## ఎన్‌టిఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం

బుక్కరాయసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త

తెలుగుదేశం వ్యవస్థపకులు మాజి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరితారకరామారావు శత జయంతి సందర్భంగ బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్న మెంట్‌లో గెలుపొందిన వారికి ఆదివారం శింగనమల నియోజ కవర్గం ద్విసభ్యకమిటీ సభ్యలు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసా నా యుడు, టిడిపి సీనియర్ నాయకులు మాజి జడ్పిటీసీ రామలింగారెడ్డి, జిల్లా అదికార ప్రతినిది పర్వతనేని శ్రీదర్‌బాబు, నలుగురు కలసి విన్నర్ టీం సునా మి టైగర్స్‌కు రూ, 111000 రూపాయలకు ప్రైజ్‌మని అంద జేశారు. బుక్కరాయసముద్రం మాజి సర్పంచు రమాదేవి భర్త ఎస్. నారాయణస్వామి రూ, 25000 విన్నర్, రన్నర్స్ కప్పులను అందజేశారు. క్రికెట్ టీమ్ సభ్యలకు టి షర్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కేశన్న, మాజి సర్పంచు లక్ష్మినారా యణ, బాబయ్య తదితిరులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులను సన్మానిస్తున్న క్రికెటర్లు

## ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్న కేఎం.జకివుల్లా

అనంతపురం అర్బన్, జూన్ 11 ప్రభాతవార్త

అనంతపురం అర్బన్ రాణ ినగర్‌లో ఇంటింటా ప్రజా సమ స్యలు తెలుసుకో వడానికి టిడిపి సీనియర్ నాయకులు కెఎం జకీవుల్లా పాల్గొన్నారు. నగరం లో ప్రజలు పడుతున్న ఇబ్బం దులను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కా రానికి తన వంతుగా ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తూ, నిత యం ప్రజలో ఉంటూ కరోనా సమయంలో కూడా ఎంతో మంది పేద కుటుంబాలకు ఆర్థిక సహా యం, నిత్యవసర సరుకులు, చలికాలంలో దుప్పట్లు పంపిణీ మెడికల్ క్యాం పులు, కులమతాల అతీతంగా పేద కుటుంబాలకు వివాహ కార్యక్రమాలు నగరంలో ఎన్న దశాబ్దాల నుంచి తన కుటుంబం చేస్తున్న ప్రజాసేవను తాను కూడా అదే పద్దతిలో ప్రజలకు సేవ చేస్తూ నగరంలో ఎలాంటి వారికైనా ఎలాంటి సహా యం చేయడానికి ముందు ఉండడం, తాను అండగా ఉంటూ అమ్మ ఆర్గనైజే షన్ వారి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమానికి టిడిపి సీని యర్ నాయకులు నంబూరి రమణ, అమ్మ టీం అధ్యక్షులు షేక్షా, మోహా న్‌కుమార్, లక్ష్మినా యుడమ్మ, ముక్తియార్, మాధవ్ యాదవ్, కేశవ్ రాయల్, జయరామ్‌నాయక్, తిరు పాలు, ఉమాదేవి, షఫీ, ఈరప్ప, ఉప సర్పంచు రామాంజి, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కెఎం.జకీవుల్లా